ప్రతిపక్షాల సెల్ఫ్ గోల్

- అవిశ్వాసం నెగ్గే బలం లేకపోయినా ప్రయత్నం
- సంతకం పెట్టి సమావేశానికి కౌన్సిలర్ గైర్హాజరు

మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సెల్ఫ్ గోల్ కొట్టుకున్నారు. నెల రోజులుగా మణికొండలో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. గురువారం నిర్వహించిన అవిశ్వాసం తీర్మానం వీగిపోయింది.



సమావేశంలో వివరాలను వెల్లడించిన ఆర్డీఓ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్



అవిశ్వాస తీర్మానానికి హాజరైన కౌన్సిలర్లు

మణికొండ: మున్సిపల్ చైర్మన్‌ను పదవీచిత్యున్ని చేయాలంటే 13 మంది సభ్యుల బలం అవసరం ఉండగా.. 10 మంది సభ్యులతో ప్రయోగం చేసి ప్రతిపక్ష పార్టీలు విఫలమయ్యాయి. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయింది.

సరైన బలం లేకుండానే..

సరైన సంఖ్యాబలం లేకుండానే పది మందితో క్యాంప్ రాజకీయాలకు తెరలేపిన ప్రతిపక్షాలకు దీటుగా తనకు అవసరమైన 8 మంది కౌన్సిలర్లతో అదే గోవాలో క్యాంప్ పెట్టి వారికి సరైన బలం లేకుండా చేసి సరైన సమయంలో రాజకీయ చతురతను ప్రదర్శించి తన పదవిని నిలుపుకోవటంలో చైర్మన్ సఫలమయ్యారని పలువురు చెబుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో చైర్మన్ వర్గంలో ఉన్న ఒక్క కౌన్సిలర్ ఇటువైపు వస్తే అవిశ్వాసం నెగ్గేది.

మెజార్టీ మద్దతు తమకే ఉంది: ప్రతిపక్ష కౌన్సిలర్లు

మణికొండ మున్సిపాలిటీలో మెజార్టీ కౌన్సిలర్ల విశ్వాసాన్ని కోల్పోయిన చైర్మన్ నరేందర్‌ముదిరాజ్ ఓటమి చెందినట్టేనని బీఆర్ఎస్ పార్టీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్లు పద్మారావు, శ్రీకాంత్‌స్వామిలు పేర్కొన్నారు. సమావేశం అనంతరం వారు మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా నిధులను ఇష్టానుసారంగా నచ్చిన వార్డుల్లో బిల్డర్లు, వ్యాపారస్తుల నుంచి వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. తమ వార్డులను పట్టించుకోకపోవటం, ఒంటెద్దు పాలన నచ్చకనే అవిశ్వాసం పెట్టామన్నారు. కొంత మంది సభ్యులు బెదిరింపులు, ఇతర కారణాలతో సమావేశానికి హాజరుకాలేదన్నారు. భవిష్యత్తులో ప్రజావసరాలకు తగినట్లుగా నిధులను ఖర్చుచేసేలా చూస్తామన్నారు.

సమావేశం సాగిందిలా..

మణికొండ మున్సిపల్ చైర్మన్ కె.నరేందర్‌ముదిరాజ్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం వీగిపోయింది. ఆయనను పదవీ నుంచి దించేందుకు 13 మంది సభ్యులు సమావేశానికి హాజరుకావాల్సి ఉండగా.. కేవలం 10మంది మాత్రమే హాజరుకావటంతో వీగిపోయిందని రాజేంద్రనగర్ ఆర్డీఓ వెంకట్‌రెడ్డి ప్రకటించారు. గురువారం జరిగిన సమావేశానికి ఉదయం 11.30 గంటలకు ముందుగా 8వ వార్డు కౌన్సిలర్ నవీన్, 7వ వార్డు కౌన్సిలర్ పద్మారావులు హాజరయ్యారు. అనంతరం 16వ వార్డు కౌన్సిలర్ శైలజ, 1వ వార్డు కౌన్సిలర్ హైమాంజలి, 4వ వార్డు కౌన్సిలర్ వందన, 15వ వార్డు కౌన్సిలర్ బి.కావ్య, 20వ వార్డు కౌన్సిలర్ కె.లక్ష్మి, 13వ వార్డు కౌన్సిలర్ శ్వేత హాజరయ్యారు. అప్పటికే సమయం 12.30 కావస్తుండటంతో మరింత మంది సభ్యులు దారిలో ఉన్నారని మరింత సమయం పెంచాలని ఆర్డీఓ వెంకట్‌రెడ్డిని కోరారు. దీంతో ఆయన సమ్మతించి మరో అరగంట పెంచి ఒంటిగంట వరకు సమయం ఇచ్చారు. లోపలే ఉన్న కౌన్సిలర్లు బయటకు వచ్చి అప్పటి వరకు సమావేశానికి రాని కౌన్సిలర్లకు ఫోన్‌లు చేయటంతో 19వ వార్డు కౌన్సిలర్ కె. రామకృష్ణారెడ్డి, 9వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్‌స్వామి రాగా.. వారంతా కలిసి తిరిగి సమావేశం హాల్‌లోకి వెళ్లారు. అప్పటికి వారి బలం 10 మంది మాత్రమే ఉండటంతో అవిశ్వాస తీర్మానం వీగిపోయిందని ఆర్డీఓ ప్రకటించటంతో బయటకు వచ్చేశారు.

> **నిబంధనల ప్రకారమే నిర్వహించాం..**
>
> మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని 10 మంది కౌన్సిలర్లు తమకు చైర్మన్‌పై విశ్వాసం లేదని లేఖను అందించడంతో ఆయన ఆదేశాల మేరకు గురువారం మున్సిపల్ చట్టం- 2019 ప్రకారం ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశాం. సమావేశానికి ముందుగా 8 మంది, తరువాత 10 మంది మాత్రమే హాజరుకావటంతో అవిశ్వాసం వీగిపోయింది. ప్రస్తుతం మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న నరేందర్‌ముదిరాజ్ పూర్తి కాలం తన పదవిలో కొనసాగుతారు.
>
> – వెంకట్‌రెడ్డి, ఆర్డీఓ

చర్చనీయాంశమైన కౌన్సిలర్ గైర్హాజరు..

జిల్లా కలెక్టర్‌కు ఇచ్చిన అవిశ్వాస లేఖపై సంతకం చేసిన 2వ వార్డు కౌన్సిలర్ వసంతరావు సమావేశానికి రాకపోవటం చర్చానీయాంశమైంది. 12 మంది సభ్యుల బలం కూడగడతామంటేనే 13వ వ్యక్తిగా తాను లేఖలో సంతకం చేశానని వసంతరావు చెప్పారు. ముందు నుంచి తటస్థంగా ఉన్న వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి సైతం సమావేశానికి హాజరుకాలేదు. చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు కె.లక్ష్మీనారాయణ, పురుషోత్తం, మీన, కె.జ్యోతి, ఎస్.శ్వేత భర్త కిరణ్‌కుమార్, ఇటీవల బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన యాలాల లావణ్యలు గోవాలోనే ఉన్నారు. మరో కాంగ్రెస్ కౌన్సిలర్ ఆంజనేయులు అనారోగ్యంతో తన ఇంటి వద్దనే ఉండగా.. ఆయన ఇంటి వద్ద కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బందోబస్తుగా నిలిచారు.

సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలి

మనూ వీసీ ప్రొ.సయ్యద్ ఐనుల్ హసన్

రాయదుర్గం: భావితరాల కోసం మన సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఉందని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఉర్దూ విశ్వవిద్యాలయంలో నేషనల్ కల్చరల్ ఆడియో విజువల్ ఆర్కైవ్స్ (ఎన్‌సీఏఏ), ఇందిరాగాంధీ నేషనల్ సెంటర్ ఫర్ ఆర్ట్స్ (ఐజీఎన్‌సీఏ) సహకారంతో ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) ఆడియో విజువల్ ఆర్కైవింగ్‌పై మూడు రోజుల వర్క్‌షాప్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంస్కృతిక మార్పిడి, పరిశోధన, విద్యను పెంపొందించడంలో ఇటువంటి కార్యక్రమాల ప్రాముఖ్యతను ఆయన వివరించారు. ఎన్‌సీఏఏ కల్చరల్ ఇన్ఫర్మేటిక్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాపానంద్ ఝూ మాట్లాడుతూ వనరులు, డేటాను ఆర్కైవ్ చేయడంలో సవాళ్లను ఆయన వివరించారు. రిజిస్ట్రార్ ఇష్తియాక్ అహ్మద్, ఐఎంసీ డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్, రిసోర్స్‌పర్సన్ ఇర్ఫాన్ జుబైరి ప్రసంగించారు. కార్యక్రమంలో నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మనూ ప్రొఫెసర్‌కు యునెస్కో ఆహ్వానం

రాయదుర్గం: మనూలోని ఇన్‌స్ట్రక్షనల్ మీడియా సెంటర్(ఐఎంసీ) డైరెక్టర్ రిజ్వాన్ అహ్మద్‌కు యునెస్కో కెనడా సమావేశానికి ఆహ్వానం అందించింది. డిజిటల్ పర్యావరణంపై కెనడాలోని క్యూబెక్‌సిటీలో మే 2024లో కెనడా ప్రభుత్వం నిర్వహించే రిఫ్లెక్షన్ గ్రూప్ మొదటి సమావేశానికి రిజ్వాన్ పాల్గొంటారు.యునెస్కో ద్వారా ప్రపంచంలోని నలుమూలల నుంచి 18 మంది నిపుణులను ఎంపిక చేయగా అందులో 'మనూ' ప్రొఫెసర్‌కు అవకాశం లభించింది.

శ్వేతాంబర్‌కు డాక్టరేట్ రావడం హర్షణీయం



శ్వేతాంబర్

అత్తాపూర్: బండ్లగూడలోని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో హెచ్‌ఓడీగా సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్న ఆచార్యులు శ్వేతాంబర్‌కు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ రావడం సంతోషకరమని కళాశాల సెక్రటరీ సంరెడ్డి సురేందర్‌రెడ్డి అన్నారు. శ్వేతాంబర్ 6 పరిశోధనా పత్రాలపై ఓరుగల్లు జిల్లా కంటే ఆత్మకూరు వాగుపై వాటర్ షెడ్ పరివాహక ప్రాంతంలో నీటి నాణ్యత అనే అంశంపై ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ప్రభాకర్, హెచ్‌ఓడీ జియోలజీ మార్గదర్శకంలో దీనిని సమర్పించారు. ఈ సందర్భంగా శ్వేతాంబర్ మాట్లాడుతూ... పీహెచ్‌డీ చేసేందుకు కళాశాల యజమాన్యం అధ్యాపకులు ఎంతగానో సహకరించినట్లు వివరించారు. కళాశాల జాయింట్ సెక్రటరీ సంరెడ్డి ధనుంజయరెడ్డి, ప్రిన్సిపాల్ ఉషశ్రీకి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



చెత్త సేకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ శరత్‌చంద్ర

బండ్లగూడ: ప్రజలు ఇళ్లల్లోని చెత్తచెదాలను చెత్త సేకరణ కార్మికులకే అందించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్‌చంద్ర సూచించారు. గురువారం కార్పొరేషన్ పరిధిలో 13,14,21 డివిజన్‌లో శానిటేషన్, స్వీపింగ్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శానిటేషన్‌తోనే పరిపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించి, ప్రజారోగ్యానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని సిబ్బందికి సూచించారు. రోడ్ల వెంట వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. రోజూవారి చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తూ.. స్వీపింగ్ పనులను సక్రమంగా నిర్వహించాలన్నారు. ఇండస్ వ్యాలీ పక్కన ఉన్న డంపింగ్ యార్డును ఆయన సందర్శించి పరిశీలించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరేష్, శానిటరీ జవాన్లు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

శంషాబాద్‌కు బీజేపీ విజయసంకల్ప యాత్ర



మాట్లాడుతున్న బీజేపీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ లక్ష్మణ్

శంషాబాద్: బీజేపీ చేపట్టిన విజయ సంకల్ప యాత్ర గురువారం సాయంత్రం శంషాబాద్ పట్టణానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పాలనలో బొగ్గు దగ్గరి నుంచి బోఫోర్స్ వరకు మొత్తం కుంభకోణాలు చేసి వేల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ పాలనలతో దేశం సుస్థిరతో పాటు సుసంపన్నమైన భారత్‌గా ఎదుగుతోందన్నారు. వందల ఏళ్లుగా భారత ప్రజల కలగా ఉన్న రామమందిర నిర్మాణం ప్రధాని సంకల్పంతోనే సాధ్యమైందన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు సిద్ధాంతాలు లేని పార్టీలని ఎద్దేవా చేశారు. గత పాలనలో బీఆర్ఎస్ పాలకులు దోచుకున్న ప్రజాధనాన్ని దక్కించుకుని దాచుకునే పనిలో కాంగ్రెస్ పాలకులున్నారని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అర్థం లేనివన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ విజయాన్ని ఏ పార్టీలు అడ్డుకోలేవని విశ్వాసం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలన అస్తవ్యస్తంగా మారిందని బీజేపీ శాసనసభాపక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలుకు నోచుకునే ప్రసక్తేలేదన్నారు. బీజేపీ సీనియర్ నాయకులు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే రత్నం, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రేమ్‌రాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, వై. శ్రీధర్, కె.ప్రశాంత్, దేవేందర్, కొండ శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో పైపులు.. ప్రమాదాలకు నిలయాలు



దర్గా నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారిపై ఇలా..

బండ్లగూడ: అధికారుల నిర్లక్ష్యానికి బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనుల కోసం రోడ్లపై వదిలేసిన పైపులను పట్టించుకోకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. కార్పొరేషన్ పరిధిలోని దర్గా నుంచి కిస్మత్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారిపై అభివృద్ధి పనులను నిర్వహించేందుకు అధికారులు భారీ పైపులైన్లను తీసుకొచ్చారు. వీటిని రోడ్ల మధ్యలో డంప్ చేసి వదిలి పోయారు. అసలే వన్‌వే రోడ్డును పూర్తిగా ఆక్రమించేలా ఈ పైపులను వదిలేశారు. గత కొద్ది రోజులుగా ఈ పైపులు ఇలాగే దర్శనమిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. రోడ్లపై డంప్ చేసిన అధికారులు, సిబ్బంది వీటిని తొలగించకపోవడంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. రాత్రి సమయంలో సమస్య మరింత తీవ్రంగా ఉంది. అసలే టర్నింగ్స్ వద్ద ఈ పైపులు ఉండటంతో అటుగా కనిపించకుండా వచ్చే వాహనదారులు వీటికి ఢీకొని ప్రమాదాల బారినపడుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్ల మధ్యలో ఉన్న పైపులను తరలించాలని ప్రజలు కోరుతున్నారు.

వీధికుక్కల స్వైర విహారం



కె.కె.నగర్-1లో గుంపులుగుంపులుగా తిరుగుతున్న వీధి కుక్కలు

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధికుక్కల బెడదతో స్థానిక ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గుంపులు గుంపులుగా కుక్కలు స్వైర్య విహారం చేస్తూ.. ఒంటరి మహిళలు, పిల్లలపై దాడులకు ఎగబడుతున్నాయి. దీంతో ఇళ్ల నుంచి బయటకు రావాలంటేనే ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. కార్పొరేషన్ పరిధిలోని కె.కె.నగర్-1లో వీధి కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. నిత్యం 9-12 వీధి కుక్కలు గుంపులుగుంపులుగా తిరుగుతున్నాయన్నారు. ద్విచక్ర వాహనాలు, కార్ల వెంట పడుతూ.. దాడులకు ఎగబడుతున్నాయి. దీంతో అనేక మంది ద్విచక్ర వాహనదారులు కుక్కల దాడిలో గాయాలపాలైన ఘటనలు అనేకం ఉన్నాయి. కుక్కల బెడద నుంచి కాపాడాలని కార్పొరేషన్ అధికారులకు పలుసార్లు ఫిర్యాదులు చేసిన ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కుక్కలబెడద నుంచి ప్రజలను కాపాడాలని కోరారు.

ప్రతిష్ఠాపనోత్సవాలు

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నేతాజీనగర్ శ్రీ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు గురువారం కనుల పండువగా నిర్వహించారు. ఈ వేడుకలకు తొగుట పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామి హాజరై యంత్ర ప్రతిష్ఠ చేశారు. ఉత్సవాల్లో భాగంగా వినాయక, శ్రీ అభయాంజనేయస్వామి, ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే బొడ్రాయి ప్రతిష్ఠ చేశారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి ఇంచార్జ్ జగదీశ్వర్‌గౌడ్, ఆలయ ధర్మకర్తలు లేగల సత్యనారాయణరెడ్డి, లేగల ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు. కాలనీలవాసులు పెద్దఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు ఉప్పరి శేఖర్‌సాగర్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ప్రతినిధులు రామేశ్వరమ్మరెడ్డి, మల్లేశం ముదిరాజ్ పాల్గొన్నారు.

రథోత్సవం



రాయదుర్గం: వేదబ్రాహ్మణుల మంత్రోచ్చారణలు..భక్తుల జయజయధ్వానాల నడుమ రంగనాథస్వామి రథోత్సవంను గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

ఏటీఎం చోరీకి విఫలయత్నం

- గంటల వ్యవధిలో నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

శంషాబాద్: పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎం పగలగొట్టి డబ్బులు దోచుకునేందుకు యత్నించిన ఇద్దరిని ఆర్‌జీఐఏ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. బుధవారం అర్ధరాత్రి పట్టణంలోని యూనియన్ బ్యాంక్ ఏటీఎం వద్దకు ఇద్దరు దుండగులు వచ్చారు. ఏటీఎంను పగులగొట్టే ప్రయత్నంలో అలారం మొగడంతో స్థానికులు అప్రమత్తమై బయటికి వచ్చారు. అప్పటికే అక్కడి నుంచి నిందితులు పరారయ్యారు. స్థానికుల సమాచారం మేరకు ఏటీఎం వద్దకు చేరుకున్న పోలీసులు సీసీ ఫుటేజీలను పరిశీలించి రాళ్లగూడ జేఎన్ఎన్‌యూఆర్ గృహాల్లో నివాసం ఉంటున్న క్యాబ్ డ్రైవర్ చేవెళ్ల కృష్ణ (34), ఎయిర్‌పోర్టులోని ఓ సంస్థలో హౌస్ కీపింగ్ చేస్తున్న మరికింటి కృష్ణ (34)లు గుర్తించి కొద్ది గంటల వ్యవధిలోనే వారిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలి

గచ్చిబౌలి: విధి నిర్వహణలో ప్రజలతో మర్యాద పూర్వకంగా మెలగాలని యాంటీ నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్, ఏడీజీపీ సందీప్ శాండిల్య అన్నారు. గురువారం కొండాపూర్ 8వ బెటాలియన్‌లో ఆర్మ్‌డ్ రిజర్వ్(ఏఆర్) ఎంపికైన 377 మంది కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సందీప్ శాండిల్య మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరు క్రమ శిక్షణతో మెలగాలన్నారు. శారీరక దృఢత్వం, మానసిక స్థైర్యం, వృత్తి నైపుణ్యం ఉంటేనే విధుల్లో రాణిస్తారన్నారు. కొండాపూర్ బెటాలియన్ కమాండెంట్ సన్నీ మాట్లాడుతూ శిక్షణలో నేర్పించే ప్రతి విషయం అమూల్యమైందేనని అన్నారు. శిక్షణలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలని ధర్నా



బండ్లగూడ మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ధర్నా చేస్తున్న కార్పొరేటర్ శ్రవంతి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో అభివృద్ధి పనులు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని కార్పొరేటర్ నాగుల శ్రవంతినరేందర్ అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్‌లో తీర్మానం చేసి 8 నెలలు అవుతున్నా.. పనులు చేపట్టడం లేదన్నారు. మంజూరైన పనులను చేపించుకునేందుకు ధర్నాలు చేయాల్సిన అవసరం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందికరంగా ఉన్నా.. పనులను వెంటనే చేపట్టాలని, కార్పొరేషన్‌లో అధికారులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజలకు అవసరాలు తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ప్రజలు తమ వద్దకు వచ్చి సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారని, వారికి ఏమి చెప్పాలో కూడా అర్థం కాని పరిస్థితుల్లో ధర్నాలు చేయాల్సి వస్తోందని వాపోయారు. అధికారులు తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. ప్రజా సమస్యలు పరిష్కరించేంత వరకు తమ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు.



అధికారులు, సిబ్బందితో సమావేశమైన డీసీ రవికుమార్

శానిటేషన్‌పై డీసీ సమావేశం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ కార్యాలయంలో ఉప కమిషనర్ రవికుమార్ శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం సిబ్బంది, అధికారులకు పలు సూచనలు, జాగ్రత్తలు చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సర్కిల్ పరిధిలోని ఐదు డివిజన్లలో పారిశుద్ధ్య పనులను ఎలాంటి ఫిర్యాదులు లేకుండా చేపట్టాలని సూచించారు. ఓపెన్ పాయింట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా అధికారులు, సిబ్బందికి ఆదేశించారు. ఇంటింటికి తిరిగి చెత్త సేకరించేవారు క్రమం తప్పకుండా వెళ్లి చెత్తను సేకరించాలన్నారు. వారి పని తీరును అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఫిర్యాదు అందగానే స్పందించాలని వెల్లడించారు. తడి, పొడి చెత్తపై మరింత అవగాహన పెంచాలని పేర్కొన్నారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మక్క, సారక్క జాతరకు ఏర్పాట్లు పూర్తి



విద్యుత్ దీపాల అలంకరణలో సమ్మక్క, సారలమ్మ గుండ్లు

రాజేంద్రనగర్: సమ్మక్క సారలమ్మ జాతరకు రాజేంద్రనగర్ మనసా హిల్స్ ముస్తాబవుతుంది. ఈనెల 23,24వ తేదీల్లో సమ్మక్క, సారక్క జాతరను నిర్వహించనున్నారు. గుట్టపై వెలిసిన సమ్మక్క సారలమ్మ గుండ్లను వివిధ రకాల విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. గుట్ట ప్రాంతాన్ని వివిధ విద్యుత్ దీపాలతో పాటు వివిధ రకాల పూలతో అందంగా తీర్చిదిద్దారు. శుక్రవారం తెల్లవారు జామున ప్రత్యేక పూజా కార్యక్రమాలతో జాతరను ప్రారంభించనున్నట్లు నిర్వాహకుడు నిరుడు శ్రీరాములు ముదిరాజ్ తెలిపారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రెండ్రోజుల పాటు నిర్వహించనున్న ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలివస్తారన్నారు. వారికి అనుగుణంగా భారీ ఏర్పాట్లను చేపట్టామన్నారు.

కల్వర్టు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద నిర్మిస్తున్న బాక్స్‌టైప్ కల్వర్టు, డ్రైన్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు రూ.4 కోట్లతో బాక్స్ టైప్ కల్వర్టు, డ్రైన్ పనులను చేపట్టామన్నారు. పనుల్లో వేగం పెంచాలన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు వీరేశం గౌడ్, మోహన్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు గౌతమ్‌గౌడ్ పాల్గొన్నారు.


సేవా దృక్పథంతో ప్రజలకు మెరుగైన వైద్యం



నూతన బ్లాక్‌లను ప్రారంభిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

అత్తాపూర్: సేవా దృక్పథంతో ప్రజలకు మెరుగైన వైద్యాన్ని అందించాలని తెలంగాణ రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. గురువారం అత్తాపూర్‌లోని జర్మన్‌టెక్ ఆస్పత్రిలో నూతనంగా కార్డియాలజీ విభాగం, రోబోటిక్ జాయింట్ రీప్లేస్‌మెంట్ విభాగం బ్లాక్‌లను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఆస్పత్రి చైర్మన్ అండ్ ఎండీ జావీద్ జార్ ఖాన్, సీఈఓ జయరాం ఆనంద్‌బాబు, డా.మీర్ ఖాలీద్ అలీ, సీఓఓ డా.ఉమేరా నౌషీన్, సీబీఓ డా.మహమ్మద్ ఉమర్‌ఖాన్, కిస్మత్‌పూర్ కార్పొరేటర్ సురేష్‌గౌడ్ గోకరి తదితరులున్నారు.

బీజేపీ ముఖ్య నేతల సమీక్ష సమావేశం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

రాజేంద్రనగర్: విజయ సంకల్ప యాత్రలో భాగంగా శుక్రవారం రాజేంద్రనగర్ డివిజన్ నుంచి బస్సుయాత్రలో భాగంగా కేంద్ర మంత్రి అశ్వినికుమార్ వస్తున్న సందర్భంగా రాజేంద్రనగర్ డివిజన్ ముఖ్య నాయకుల సమావేశం చేపట్టారు. గురువారం డివిజన్ అధ్యక్షులు జి.బాబురావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా జనరల్ సెక్రటరీ వై.శ్రీధర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, మూల శ్రీనివాస్‌గౌడ్, రాహుల్‌రెడ్డి, హరికిషన్, జీ.ఎస్.విఠల్, సందీప్‌కుమార్, మల్లేష్ చారి తదితరులు పాల్గొన్నారు.

గోల్ఫ్ చాంపియన్‌గా జెరూషా జోయన్



బంగారు పతకం సాధించిన జెరూషా జోయన్

బండ్లగూడ: సౌత్‌జోన్ గోల్ఫ్ టూర్-2024లో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ అభ్యుదయానగర్ కాలనీకి చెందిన జెరూషా జోయన్ బంగారు పతకం కై వసం చేసుకున్నాడు. నార్సింగిలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్‌లో ఏడోతరగతి చదువుతున్న జోయన్ చెన్నైలో జూనియర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్‌గా నిలిచాడు. సౌత్ జోన్ నేషనల్స్‌ను చెన్నైలోని టిఎన్‌జీఎఫ్ కాస్మోగోల్ఫ్ క్లబ్‌లో నిర్వహించిన పోటీల్లో బంగారు పతకాన్ని సాధించాడు. ఈ సందర్భంగా కోచ్ ఎం.భాస్కర్, పాఠశాల ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు జోయన్‌ను అభినందించారు.

వ్యక్తి అదృశ్యం



లక్ష్మణ్ (ఫైల్)

అత్తాపూర్: కరీంనగర్ జిల్లా బెల్లంపల్లిలో రోడ్డు క్లీనర్ మిషన్ వదిలి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన ఓ టాటా ఏసీ డ్రైవర్ తిరిగి ఇంటికి రాలేదు. అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీను తెలిపిన వివరాల ప్రకారం.. చిక్ చావనిలో నివాసం ఉంటున్న లక్ష్మణ్ (42) ఈనెల 20న ఉదయం 11 గంటల సమయంలో టాటా ఏసీ వాహనాన్ని తీసుకొని వెళ్లాడు. అదే రోజు రాత్రి 8 గంటలకు ఫోన్ చేసి బెల్లంపల్లికి కిరాయికి వెళ్తున్నట్లు రోడ్డు క్లీన్ చేసే మిషనరీ వదిలి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పాడు. ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగి రాకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఫోన్ చేస్తే స్విచాఫ్ వస్తుందన్నారు. ఈ మేరకు వారు అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.